ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024



కోడిగుడ్డు మంత్రి చేసిందేమీ లేదు

బినామీల ద్వారా 600 ఎకరాలు అడ్డగోలుగా కబ్జా

- జిల్లాలో అభివృద్ధి శూన్యం
- ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు
- సొంత నియోజకవర్గంలో ఒక్కరికీ ఉద్యోగం ఇప్పించలేదు
- తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి
- అనకాపల్లి 'శంఖారావం' సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం


వడ్డాది శంఖారావం సభకు హాజరైన తెలుగుదేశం పార్టీ శ్రేణులు


అనకాపల్లి సభలో టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు


పిడికిలి బిగించిన నారా లోకేశ్

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

జిల్లాకు చెందిన కోడిగుడ్డు మంత్రి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని బినామీల ద్వారా 600 ఎకరాలు అడ్డగోలుగా కబ్జా చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు.

అనకాపల్లి పట్టణానికి సమీపంలో పూడిమడక రోడ్డులో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు, కనీసం సొంత నియోజకవర్గానికి ఎటువంటి ... మిగతా 7వ పేజీలో


అనకాపల్లి సభలో లోకేశ్‌కు బెల్లం దిమ్మను బహూకరిస్తున్న పీలా గోవింద, టీడీపీ నాయకులు


వడ్డాది సభలో లోకేశ్‌కు జ్ఞాపికను అందిస్తున్న బత్తుల తాతయ్యబాబు, రాజు, తదితరులు

పేరులోనే ధర్మం... చేసేదంతా అధర్మం

చోడవరంలో నాడు అభివృద్ధి... నేడు అవినీతి

- ఇక్కడ రోడ్లపై వారం ప్రయాణిస్తే ఆస్పత్రిపాలే!
- గోవాడ షుగర్స్‌ను ఆదుకుంటాం
- రూ.100 కోట్లతో ఇథనాల్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం
- జనసేన అధినేత పవన్ హామీ మేరకు చెరకు టన్నుకు రూ.3,500 మద్దతు ధర ఇస్తాం
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా
- వడ్డాది 'శంఖారావం' సభలో నారా లోకేశ్

చోడవరం/ బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 19: తెలుగుదేశం హయాంలో చోడవరం నియోజకవర్గాన్ని రూ.1200 కోట్లతో అభివృద్ధి చేస్తే, వైసీపీ పాలనలో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ అవినీతి అడ్డాగా మార్చేశారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. మండలంలోని వడ్డాదిలో సోమవారం రాత్రి నిర్వహించిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడుతూ, పేరులోనే ధర్మం ఉందని, ఆయన చేసేదంతా అధర్మమేనని ఎమ్మెల్యే ధర్మశ్రీని ఉద్దేశించి విమర్శించారు. ఎమ్మెల్యే సోదరులు సైతం అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇప్పటికే రూ.50 కోట్లు వెనకేసుకున్నారని ... మిగతా 7వ పేజీలో



రైవాడకు గ్రహణం

అసంపూర్తిగా కాలువల ఆధునికీకరణ

- బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- మూడున్నరేళ్ల క్రితం రూ.30.43 కోట్ల జైకా రుణం మంజూరు
- 11 కి.మీ.ల మేర లైనింగ్ పనులు పూర్తి
- విలువ రూ.4.17 కోట్లు.. కాంట్రాక్టర్‌కు అందింది రూ. 2.88 కోట్లే!
- తదుపరి పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- జలవనరుల శాఖ అధికారులు నోటీసులు
- బ్లాక్‌లిస్టులో పెట్టేందుకు వెనకడుగు
- డిప్యూటీ సీఎం ఇలాకాలో ఇదీ పరిస్థితి!


ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో కోతకు గురైన రైవాడ కాలువ గట్టు

విశాఖపట్నం/దేవరాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం మండలాలకు సాగునీరు, విశాఖకు తాగునీరు అందించే రైవాడ ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ పనులకు గ్రహణం పట్టింది. కాలువలకు సిమెంట్ లైనింగ్, ఇతర అభివృద్ధి పనులకు జపాన్ ఆర్థిక సంస్థ ఇచ్చిన రుణం సొమ్మును పనులకు కేటాయించడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. చేపట్టిన పనులకు నెలల తరబడి బిల్లులు మంజూరు కాకపోవడంతో రెండేళ్ల క్రితం కాంట్రాక్టర్ తట్టాబుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. వాస్తవంగా గత ఏడాది జూలై నాటికి కాలువల ఆధునికీరణ పనులు పూర్తికావాల్సి వుండగా, కేవలం 18.5 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు పలు మార్లు నోటీసులు ఇచ్చిన జలవనరుల శాఖయ అధికారులు తాజాగా నెలన్నర క్రితం మరో నోటీస్ ఇచ్చారు. అయినా కాంట్రాక్టర్ స్పందించలేదు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలంలో వున్న రైవాడ రిజర్వాయర్ కుడి, ఎడమ ప్రధాన కాలువలు, పిల్ల కాలువలను జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నిధులతో ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జలవనరుల శాఖ అధికారులు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు రూ.30.43 కోట్లకు టెండర్లు ఆహ్వానించారు. 2020 జూలై 23న కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. రెండేళ్లలో పనులు పూర్తిచేయాలి. సంబంధిత కాంట్రాక్టర్ భారీ యంత్రా సామగ్రి తీసుకువచ్చి ... మిగతా 8వ పేజీలో


దేవరాపల్లి మండలం చేములపాలెం వద్ద అసంపూర్తిగా వున్న కాలువ సిమెంట్ లైనింగ్ పనులు

రాష్ట్రాభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలు

ఈ రెండింటినీ దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి

- ఈసారి అధికారంలోకి రావాలనే కూటమిగా వెళుతున్నాం
- కొన్ని త్యాగాలు తప్పవు
- ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తాం
- ఏదైనా ఉంటే నాతోనో, రాజకీయ వ్యవహారాల కమిటీతోనే చర్చించండి
- పార్టీ నేతలతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- పర్యటన ముగించుకొని రాజమండ్రికి పయనం


పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేనలోకి చేరికలు...

విశాఖపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

ఇది చాలా కీలకమైన సమయమని, ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాలని పార్టీ నాయకులకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం వచ్చిన ఆయన సోమవారం ఉదయం నోవాటెల్ హోటల్‌లో పార్టీ నాయకులు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో విడివిడిగా మాట్లాడారు. ఈసారి అధికారంలోకి రావాలనే ధ్యేయంతో కూటమిగా కలిసి వెళుతున్నామని, ఈ నేపథ్యంలో కొన్ని త్యాగాలు తప్పవని సూచనప్రాయంగా చెప్పారు. ఎక్కడైనా ఎవరికైనా పోటీ చేసే అవకాశం రాకపోతే...భవిష్యత్తులో వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసంతృప్తితోనో, వేరే విధంగానో పార్టీ గురించి ఎక్కడా బయట మాట్లాడవద్దని సూచించారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ఇంకా నిర్ణయం కాలేదని స్పష్టంచేశారు. ఎవరికైనా అనుమానాలు, అసంతృప్తి ఉంటే వాటిని బయట మాట్లాడవద్దని, నేరుగా తన దృష్టికే తీసుకురావాలన్నారు. తాను అందుబాటులో లేనిపక్షంలో రాజకీయ వ్యవహారాల కమిటీ ఉందని, వారితో చర్చించాలని సూచించారు. అంతే తప్ప పార్టీకి నష్టం జరిగేలా వ్యవహరించవద్దని కోరారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశం ముగిసిన తరువాత విశాఖ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురిని జనసేన పార్టీలో చేర్పించారు. ఈ కార్యక్రమాలన్నీ ముగిసిన తరువాత పవన్‌కళ్యాణ్ ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం వెళ్లిపోయారు.

పేర్లు ఖరారయ్యారంటూ ఊహాగానాలు

పార్టీ అధినేతతో పలువురు సమావేశమైన సందర్భంగా కొందరికి స్పష్టమైన భరోసా లభించిందని, వారికి పోటీ చేసే అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారంటూ సోషల్ మీడియాలో కొందరి పేర్లు షికారు చేశాయి. విశాఖ జిల్లాలో ఇద్దరికి, అనకాపల్లి జిల్లాలో ఇద్దరికి ఫలానా స్థానాలు అంటూ ప్రచారం చేశారు. అయితే ఎవరి పేర్లు ఖరారు చేయలేదని, ఆ ఊహాగానాలు నమ్మవద్దని పార్టీ నాయకులు పలువురు స్పష్టంచేశారు.



చోడవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మీడియా ప్రతినిధులు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి బహిరంగ సభలో విధి నిర్వహణలో వున్న 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు జరిపిన అమానుష దాడిని జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. అనకాపల్లిలో ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ వద్ద పాత్రికేయులు చిననాలుగు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. చోడవరం ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నర్సీపట్నం ప్రెస్ క్లబ్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా మిలాన్-2024

- తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో ప్రారంభం
- నేడు ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్

తూర్పు నౌకాదళంలో మిలాన్-2024 ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు రెండో దశల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనుండగా 50 దేశాలకు చెందిన నేవీ అధికారులు, సిబ్బంది, వారి యుద్ధనౌకలు, విమానాలు పాల్గొంటున్నాయి. -వార్త మెయిన్


సాగర తీరంలో చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు... తిలకిస్తున్న ప్రజలు


శంఖారావం సభలు సక్సెస్



లోకేశ్‌కు ఎన్టీఆర్ ప్రతిమ అందజేస్తున్న బుద్ద నాగజగదీశ్



అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభలో ప్రసంగిస్తున్న నారా లోకేశ్



అనకాపల్లి సభలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ...కోడిగుడ్డును చూపిస్తున్న నారా లోకేశ్

అనకాపల్లి జిల్లాలో శంఖారావం సభలు సోమవారం విజయవంతమయ్యాయి. అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభకు, అలాగే బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో నిర్వహించిన సభకు జనం పోటెత్తారు. టీడీపీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. జగన్ పాలనలో రాష్ట్రం ఎంతగా వెనుకబడిపోయిందో వివరించారు. లోకేశ్ ప్రసంగానికి పార్టీ శ్రేణులు, అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి కార్యకర్త విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. త్వరలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని, టీడీపీ- జనసేన ప్రభుత్వం ఏర్పాటు కావడం తథ్యమని ఆయన చెప్పారు.



తాతయ్యబాబు, జనసేన నేత పీవీఎస్ఎన్ రాజుతో..



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



నాగులాపల్లి రోడ్డులో నిర్వహించిన సభకు హాజరైన జనం



బుచ్చెయ్యపేట మండలంలో పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న లోకేశ్



లోకేశ్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న జనసేన నేత పంచకర్ల రమేశ్‌బాబు



లోకేశ్‌కు నూకాలమ్మ అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న దాడి రత్నాకర్ తదితరులు



వడ్డాదిలో అభిమానులతో కరచాలనం చేస్తున్న దృశ్యం



కార్యకర్తలతో సమావేశమైన లోకేశ్



బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో నిర్వహించిన సభలో టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



లోకేశ్‌కు బహూకరించిన కత్తి, డాలు

క్రైం... crime news

పోలీసుల అదుపులో నల్లబిల్లి గిరిజనుడు?

కొయ్యూరు, ఫిబ్రవరి 19: మండలంలోని బూదరాళ్ల పంచాయతీ నల్లబిల్లి గ్రామానికి చెందిన సీదరి రామారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఆదివారం రాజేంద్రపాలెం వారపు సంతకు వచ్చిన రామారావును పోలీసులు వలపన్ని తీసుకు వెళ్లినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న అతని భార్య లక్ష్మి సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చి తన భర్త ఆచూకీ కోసం సంప్రదించింది. అదే సమయంలో కొయ్యూరు మండల పర్యటనకు విచ్చేసిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకుంది. దీంతో చింతపల్లి అదనపు ఎ స్పీని ఎమ్మెల్యే ఫోన్‌లో సంప్రదించగా, విషయం తన దృష్టిలో లేదని, రామారావును ఎవరు తీసుకు వెళ్లారో తెలుసుకుంటానని తెలిపినట్టు సమాచారం. ఇదిలా ఉండగా రామారావు మావోయిస్టు సానుభూతిపరుడిగా జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్టుగా తెలిసింది. రామారావును పోలీసులే తీసుకు వెళ్లారని, అతని ఆచూకీ తెలపాలని భార్య లక్ష్మి వేడుకుంటున్నది.

వైసీపీ నేతలు బరితెగింపు

- ఇసుక అమ్మకాలు, మద్యం బెల్టు షాపునకు వేలంపాట
- ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహణ
- ఇసుక రూ.66 వేలు, బెల్టు షాపు రూ.40 వేలకు ఖరారు

కశింకోట, ఫిబ్రవరి 19: అధికార పార్టీ నాయకులు మరోసారి బరితెగించారు. శారదా నదిలో ఇసుక అమ్మకాలు, మద్యం బెల్టు షాపు నిర్వహణకు వేలంపాట నిర్వహించారు. పైగా ఈ ప్రక్రియను ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే చేపట్టారు. వెదురుపర్తి గ్రామంలో జరిగిన ఈ వ్యవహారానికి సంబంధించి స్థానికులు, టీడీపీ నాయకులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



ఇసుక, మద్యం బెల్టు షాపు వేలంపై శనివారం దండోరా వేస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన కశింకోట సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో శారదా నది ఒడ్డున వెదురుపర్తి గ్రామం వుంది. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహం అంతగా లేకపోవడంతో ఇసుక తవ్వకాలకు అనుకూలంగా వుంది. అదే విధంగా గ్రామంలో మద్యం దుకాణం లేకపోవడంతో కొంతమంది వ్యక్తులు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారు. దీంతో ఈ రెండు వనరులపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. నదిలో ఇసుక తవ్వకాలు/ అమ్మకం, మద్యం బెల్టు షాపు నిర్వహణకు వేలం పాట (అనధికారికంగా) నిర్వహించనున్నట్టు శనివారం రాత్రి గ్రామంలో దండోరా వేయించారు. ఆదివారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఇసుక పాట రూ.66 వేలు, బెల్టు షాపుల పాట రూ.40 వేలకు పాడుకున్నట్టు తెలిసింది. కాగా పంచాయతీ కార్యాలయంలో అనధికార వేలం పాటపై కార్యదర్శి డి.ఆనందరావును వివరణ కోరగా, కింది స్థాయి సిబ్బందితో స్థానిక వైసీపీ నాయకులు పంచాయతీ కార్యాలయం తాళాలు తీయించి వేలం పాట నిర్వహించిన విషయం తన దృష్టికి రావడంతో సిబ్బందిని హెచ్చరించానని చెప్పారు. ఇకపై అలా జరగకుండా చూస్తామని తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	118.00
లైవ్ ధర	138.00
విత్ స్కిన్	246.00
స్కిన్ లెస్	256.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

కోడిగుడ్డు మంత్రి చేసిందేమీ లేదు

... 5వ పేజీ తరువాయి

ప్రయోజనం లేదని, అభివృద్ధి చేయలేని ఇటువంటి నేతలు మనకు అవసరమా?..అని ప్రశ్నించారు. కోడిగుడ్డు మంత్రి కశింకోట మండలంలో 600 ఎకరాలు కొట్టేశారని, మంత్రి గుడివాడ అమర్‌కు బహుమతిగా కోడిగుడ్డును టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ద్వారా పంపుతున్నానంటూ కోడిగుడ్డును చూపించారు. మంత్రిగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఉద్యోగం ఇప్పించలేదని, కనీసం ఒక్క పరిశ్రమ కూడా తేలేదని లోకేశ్ మర్శించారు. మంత్రితోపాటు వైసీపీ నాయకులకు గంజాయి వ్యాపారంతో సంబంధాలు వున్నాయని ఆరోపించారు. మంత్రి అనుచరులు గ్రావెల్ దందాకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారని, ల్యాండ్ పూలింగ్‌ను బూచీగా చూపించి, రైతుల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకొంటున్నారని ఆరోపించారు. ఆర్ఈసీఎస్‌ను చంపేసిన ఘనత మంత్రి అమర్‌కే దక్కుతుందన్నారు.

అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం

టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని లోకేశ్ వెల్లడించారు. వైసీపీ పాలకులు మూసివేయించిన తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి చెరకు రైతులకు న్యాయం చేస్తామన్నారు. బెల్లం రైతులు అంటే వైసీపీకి చిన్నచూపని, నాసిరకం మద్యం అమ్ముకోడానికి నల్ల బెల్లం కొనుగోలు చేసే వ్యాపారులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నదని ఆరోపించారు.

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారంటూ వైసీపీ పాలకులు వలంటీర్ల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని లోకేశ్ విమర్శించారు. దేశంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్.టి.రామారావుదేనన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. వైనాట్ 175 అంటున్న వైసీపీ నాయకులు వైనాట్ విశాఖ స్టీల్‌ప్లాంట్, వైనాట్ పోలవరం, వైనాట్ జాబ్ క్యాలెండర్...వీటికి సమాధానం చెప్పాలని లోకేశ్ డిమాండ్ చేశారు.

కరెంట్ చార్జీలు తొమ్మిదిసార్లు పెంచారు

జగన్ పాలనలో రాష్ట్రంలో తొమ్మిదిసార్లు కరెంట్ చార్జీలు పెంచారని లోకేశ్ అన్నారు. ఇంటి పన్ను, చెత్తపన్ను, ఆర్టీసీ చార్జీలు, డీజిల్, పెట్రోల్ రేట్లతోపాటు నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచేశారన్నారు. వలంటీర్లు మీ ఇళ్లకు వచ్చి గొట్టాం పెట్టి గాలి పీల్చమంటే పీల్చవద్దని, ఎందుకంటే పీల్చే గాలికి కూడా ఈ ప్రభుత్వం పన్ను వేస్తుందని అన్నారు. టీడీపీ హయాంలో ప్రవేశ పెట్టిన అన్న క్యాంటీన్‌లు, పెళ్లి కానుకలు, విదేశీ విద్య, పండుగ కానుకలు, బెస్ట్ అవైల్‌బుల్ స్కూల్స్..ఇలా వంద రకాలకుపైగా పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని లోకేశ్ చెప్పారు.

వైసీపీ అవినీతి, అరాచక పాలనను అంతమొందించే సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్క కార్యకర్త రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అందరి సంగతి చూస్తామని వైసీపీ నేతలను ఉద్దేశించి హెచ్చరించారు.

ఈ సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ, సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు, ప్రగడ నాగేశ్వరరావు, కోట్ని బాలాజీ, దాడి రత్నాకర్, మాదంశెట్టి నీలబాబు, ఆడారి కిశోర్, జనసేన జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, అనకాపల్లి ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విశాఖ నుంచి అనకాపల్లి చేరుకున్న లోకేశ్‌కు టీడీపీ, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు.

పేరులోనే ధర్మం... చేసేదంతా అధర్మం

... 5వ పేజీ తరువాయి

ఆరోపించారు. ఉద్యోగుల బదిలీల పోస్టింగుల్లో సైతం ముడుపులు వసూలు చేయడం ధర్మశ్రీకే చెల్లిందని, అతను తిరుగుతున్న కారు కూడా మైనింగ్ కంపెనీని బెదిరించి కొనిపించాడని ఆరోపించారు. మందు గుండు సామాన్లు అమ్మడానికి కూడా ధర్మశ్రీకి కప్పం కట్టాల్సిరావడం దుర్మార్గమన్నారు.

రోడ్లను బాగు చేసే బాధ్యత నాది

టీడీపీ పాలనలో రాష్ట్రంలోనే అత్యధికంగా చోడవరం నియోజకవర్గంలో 500 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేయించామని, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీలకు భవనాలు నిర్మించామని, వైసీపీ హయాంలో ఒక్క కిలోమీటరు కూడా సీసీ రోడ్డు వేయించలేదని అన్నారు. ఈ నియోజకవర్గంలో రోడ్లపై వారం రోజులు తిరిగితే ఆస్పత్రి పాలవడం ఖాయమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయించే బాధ్యతను తాను తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

సుజల స్రవంతిని పూర్తిచేస్తాం

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తామని, ఉత్తరాంధ్రలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. చోడవరం నియోజకవర్గంలో గొట్టివాడ, వాలాబు, చాకిపల్లిల్లో వంతెనల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.

గోవాడ షుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్

టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో రూ.100 కోట్లతో ఇథనాల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి చెరకు రైతులను ఆదుకుంటామన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ ప్రకారం చెరకు టన్నుకు రూ.3,500 ఇవ్వడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. టీడీపీ, జనసేన కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా సుమారు 35 నిమిషాలపాటు సాగిన లోకేశ్ ప్రసంగాన్ని సభకు వచ్చిన జనం చివరి వరకు ఆసక్తిగా విన్నారు. జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు.. లోకేశ్‌కు కత్తి, డాలు బహూకరించారు. టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, ఇతర నేతలు జ్ఞాపికలను అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టీడీపీ నియోజకవర్గం పరిశీలకుడు మూర్తియాదవ్‌జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి శంఖారావం సభల వివరాలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19: అనకాపల్లి జిల్లాలో మంగళవారం మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో శంఖారావం సభలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు మాడుగుల నియోజకవర్గంలోని వడ్డాది- పాడేరు రోడ్డులో సభ ప్రారంభంకానున్నది. 10.36 గంటలకు లోకేశ్ ప్రసంగం, 10.56 గంటలతో పార్టీ శ్రేణులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. 11.26 గంటలకు పార్టీ శ్రేణులకు సూపర్ సిక్స్ కిట్లు పంపిణీ చేస్తారు. 1.10 గంటలకు లోకేశ్ నర్సీపట్నం నియోజకవర్గానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3.06 గంటలకు బలిఘట్టం సభలో లోకేశ్ ప్రసంగిస్తారు. 3.26 గంటలకు పార్టీ శ్రేణులతో ముఖాముఖి ఉంటుంది. అనంతరం సాయంత్రం 4 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గానికి చేరుకుంటారు. కోటవురట్ల పోలీస్ స్టేషన్ దగ్గర నిర్వహించే సభలో సాయంత్రం 5.36 గంటలకు లోకేశ్ ప్రసంగిస్తారు. 6.30 గంటలకు రోడ్డు మార్గం గుండా ఆయన విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 8.30 గంటలకు విమానంలో హైదరాబాద్ బయలుదేరతారు.

'జర్నలిస్టులపై వైసీపీ దాడులు అమానుషం'

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడం అమానుషమని ఇది వైసీపీ నిరంకుశ పాలనకు అద్దం పడుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం రౌడీ పరిపాలన సాగిస్తున్నదని, గూండాలు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం 'సిద్ధం' సభల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదన్నారు.

రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ విజేత విజయనగరం



విజయనగరం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మునగపాక, ఫిబ్రవరి 19 : రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. మండలంలోని నాగులాపల్లిలో జరుగుతున్న కబడ్డీ పోటీల్లో సోమవారం సెమీ ఫైనల్స్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, తూర్పు గోదావరి జట్లు తలపడగా విజయనగరం, శ్రీకాకుళం జట్లు ఫైనల్‌కు వచ్చాయి. ఇరుజట్లు ఫైనల్‌లో హోరాహోరీగా తలపడ్డాయి. శ్రీకాకుళంపై విజయనగరం జట్టు గెలుపొందింది. జనసేన పార్టీ నాయకుడు నాగబాబు క్రీడా పోటీలను తిలకించి, క్రీడాకారిణిలకు అభినందనలు తెలిపారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, ఎలమంచిలి టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు విజయనగరం జట్టుకు ప్రథమ, శ్రీకాకుళం జట్టుకు ద్వితీయ, తూర్పుగోదావరి జట్టుకు తృతీయ, విశాఖ జట్టుకు చతుర్ధ బహుమతులను అందించారు. కాగా పురుషుల పోటీలో ఫైనల్‌లో అచ్యుతాపురం జట్టు గంగవరం జట్టుపై గెలుపొందింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు ధూళి రంగనాయకులు, మళ్ల రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న మంత్రి అమర్‌నాథ్ దంపతులు

అనకాపల్లి, ఫిబ్రవరి 19 : మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ.సత్యవతి సోమవారం ప్రారంభించారు. ఉగ్గినపాలెంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన కమ్యూనిటీ హాలు, కశింకోటలో రూ.1.5 కోట్లతో నిర్మించిన సామాజిక భవనాలు, పరవాడపాలెంలో కల్యాణమండపాన్ని, రామాలయాన్ని మంత్రి అమర్‌నాథ్ దంపతులు ప్రారంభించారు. కశింకోట ఇందిరా కాలనీలో రూ.50లక్షలు ఎంపీ లాడ్స్‌తో నిర్మించనున్న అంబేడ్కర్ కల్యాణ మండపానికి మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో అరబిందో ఫార్మా లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ ఐఎస్ఆర్.రావు, సంస్థ ప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

షర్మిల రాకతో వైసీపీ షేక్

» కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీను



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీను

నక్కపల్లి,ఫిబ్రవరి 19: పీసీసీ పగ్గాలు వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల చేపట్టగానే అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ షేక్ అవుతుందని డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీను చెప్పారు. సోమవారం సాయంత్రం ఇక్కడ జరిగిన కాంగ్రెస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దెబ్బకు ఈసారి ఎన్నికల్లో అధికార వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మేడేటి శంకర్ మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఓటు బ్యాంక్ వుందన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ బాధ్యులకు జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలను ఆయన అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన సెక్రటరీ గుమ్మెళ్ల గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రగడ చక్రరావు, మారుతి చక్రవర్తి, అప్పలరాజు,చింతకాయల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నల్లమారమ్మ ఆలయం ప్రారంభం



నల్లమారమ్మను దర్శించుకుంటున్న పీలా గోవింద

అనకాపల్లి, ఫిబ్రవరి 19 : కొత్తూరు మేజర్ పంచాయతీ పరిధిలోని రామాపురం కాలనీలో నల్లమారమ్మ నూతన ఆలయాన్ని ప్రారంభించారు. సోమవారం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. నాలుగు దశాబ్దాల క్రితం నుంచి నల్లమారమ్మని కొలుస్తున్నప్పటికి ఆలయ నిర్మాణం జరగలేదు. గ్రామ పెద్దలు అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు వారిని ఘనంగా సత్కరించారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా అధికారిణి సుధారాణి

అనకాపల్లి, ఫిబ్రవరి 19: జిల్లాలోని ఆలయాల్లో మహాశివరాత్రి ఏర్పాట్లపై జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులతో జిల్లా అధికారిణి కేఎల్.సుధారాణి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన అనుమతులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని తెలిపారు.

ప్యాకేజీ ఇచ్చే వరకూ పరిశ్రమలు వద్దు

» కారిడార్ నిర్వాసిత రైతుల పునరుద్ఘాటన

నక్కపల్లి, ఫిబ్రవరి 19: మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో ప్యాకేజీ, పరిహారం ఇచ్చే వరకూ ఎటువంటి పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు చేయకూడదని కారిడార్ నిర్వాసిత రైతులు పునరుద్ఘాటించారు. డీఎల్‌పురంలో సోమవారం సాయంత్రం ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ ప్రతినిధులు ఎం.అప్పలరాజు,లొడగల చంద్రరావు, కిల్లాడ కృష్ణ, కనకారావు, గింజాల లక్ష్మణరావు, గింజాల వెంకట రమణ తదితరులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములిచ్చిన వారికి పరిహారం ఇవ్వాలని, ఇళ్లు కోల్పోయిన వారికి, 18 ఏళ్ల వయస్సునిండిన వారికి రూ.25 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి భూమి పూజ

మునగపాక, ఫిబ్రవరి 19: స్థానిక బైపాస్ రోడ్డు సమీపంలో సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయానికి సీతారామస్వామి ఆలయ ధర్మకర్త గోగుల సువర్ణకుమార్ దంపతులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే కన్నబాబు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విశాఖ వెస్ట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడారి ఆనంద్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పి. స్వామి సత్యనారాయణ పాల్గొన్నారు.

వలంటీర్లకే గౌరవం ఎక్కువ : అదీప్‌రాజ్

సబ్బవరం, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతలు కంటే వలంటీర్లకే ఎక్కువ గౌరవిస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, కోటాన రాము, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు, ఈవోపీఆర్‌డీ మహేష్, మాజీఎంపీపీ ఎస్ ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.55,558 విరాళం

సబ్బవరం, ఫిబ్రవరి 19 : మండలంలోని అసకపల్లి శివారు ఎర్రవానిపాలెంలో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి పెందుర్తి నియోజకవర్గ జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు(బీపీరావు) సోమవారం రూ. 55,558 విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు బీపీరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా జర్నలిస్టులు ఆందోళన

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 19: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం అమానుషమని సీనియర్ జర్నలిస్టు కాంతారావు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు భాస్కర్ మాట్లాడుతూ కృష్ణపై దాడి చేసిన రౌడీమూకలను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరో సీనియర్ పాత్రికేయులు రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో జర్నస్టులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని క్రైమ్ ఏఎస్పీ సత్యనారాయణను కలిసి కృష్ణపై జరిగిన దాడిని వివరించి, నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు వెంకట్, అంజిబాబు, సూర్యారావు, ప్రసాద్, భాను, కొండలరావు, జోగా వెంకటేష్, శశికుమార్, రమణాజీ, సురేష్, గంగాధర్, కిరణ్ పాల్గొన్నారు.



నాలుగురోడ్ల కూడలి వద్ద నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు

నిరుద్యోగులను మోసం చేసిన అమర్‌నాథ్

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు



అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ నాలుగున్నరేళ్లలో నిరుద్యోగులను మోసం చేశారని, సొంత నియోజకవర్గంలో ఒక్కరికి కూడా ఉద్యోగం కల్పించలేని దౌర్భాగ్యంలో ఉన్నారని జనసేన సమన్వయకర్త పరుచూరి భాస్కరరావు అన్నారు. అనకాపల్లిలో శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల శాఖ మంత్రికి కలెక్షన్‌లపై ఉన్న శ్రద్ధ యువతకు ఉపాధి కల్పనపై లేదని విమర్శించారు. అనకాపల్లి, కశింకోట మండలాల పరిధిలో 5 వేల ఎకరాలు ప్రభుత్వభూమి ఉంటే కేవలం 50 ఎకరాలు మెడికల్ కాలేజీ కోసం మంజూరు చేయలేని అసమర్థుడు మంత్రి అమర్‌నాథ్ అని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భవనాలకు రంగుల కోసం ఖర్చుపెట్టిన రూ.3 వేల కోట్లతో 25 వేల మంది యువతకు స్వయం ఉపాధి కల్పించవచ్చన్నారు. రూ.12 లక్షలు కోట్లు అప్పు చేసిన సీఎం జగన్ రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ, ఒక్క ఉద్యోగం గాని తీసుకురాలేకపోయారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, జనసేన, టీడీపీ ప్రభుత్వం దోపిడీ దొంగల భరతం పట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

అభివృద్ధి చేయని కోడిగుడ్డు మంత్రి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ



అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గానికి కోడిగుడ్డు మంత్రి అమర్‌నాథ్ చేసిందేమీ లేదని, అవినీతి పాలనతో అనకాపల్లి అభివృద్ధిని అడ్డుకున్నారని టీడీపీ అనకాపల్లి ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ.. కోడుగుడ్డు మంత్రి నాయకత్వంలో కశింకోట మండలం విస్సన్నపేటలో నలుగురు బినామీలతో 600 ఎకరాల పేదల భూమిని ఆక్రమించారన్నారు. నియోజకవర్గంలో నర్సాపురం డ్యామ్‌ను నాశనం చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అనకాపల్లిలో మంజూరు చేసిన హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస తరలించారన్నారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో డీపట్టా భూముల కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. రూ.32 కోట్లతో టీడీపీ షుగర్ ఫ్యాక్టరీని తెరిస్తే వైసీపీ పాలకులు గత ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పూర్తయిన మరుసటి రోజే మూసివేయించారని ధ్వజమెత్తారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో 2,650 టిడ్కో ఇళ్లు నిర్మిస్తే వైసీపీ ప్రభుత్వంలో కనీసం నీటి సౌకర్యం కల్పించలేదన్నారు. దుర్మార్గాలకు పాల్పడిన కోడిగుడ్డు మంత్రికి టికెట్ ఇవ్వకుండా జగన్ ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాళ్లపాలెంలో మంత్రి అమర్‌నాథ్‌ను కోడిగుడ్లు, టామాటాలతో కొడితే పోలీస్ వాహనంతో దాక్కున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలందరూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులకు అండగా నిలవాలని కోరారు.

కోటవురట్ల శంఖారావానికి సర్వం సిద్ధం

కోటవురట్ల, ఫిబ్రవరి 19: తెలుగుదేశం పార్టీ జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్రకు సర్వం సిద్ధమైంది. పాయకరావుపేట నియోజకవర్గంలోని కోటవురట్లలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక ఏర్పాట్లు పూర్తయ్యాయి. లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు లింగాపురం, రాట్నాలపాలెం జంక్షన్ల వద్ద స్వాగతం ద్వారాలు ఏర్పాటుచేశారు. అక్కడ నుంచి కైలాసపట్నం వరకు రెండు కిలోమీటర్లు దారిపొడవునా కటౌట్స్, జెండాలను ఏర్పాటుచేశారు. పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వంగలపూడి అనిత పర్యవేక్షణలో భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. బహిరంగసభకు పెద్ద ఎత్తున జనంతోపాటు కార్యకర్తలు, అభిమానులు హాజరు కావడానికి ఏర్పాట్లు చేశారు. బహిరంగ సభ ఏర్పాట్లను నక్కపల్లి సీఐ అప్పన్న, కోటవురట్ల ఎస్ఐ రమణయ్య పరిశీలించారు.



శంఖారావం బహిరంగ సభ ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

పెతకంశెట్టి సేవలు చిరస్మరణీయం : బుద్ద

మునగపాక, ఫిబ్రవరి 19: మాజీ ఎంపీ, దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం సేవలు చిరస్మరణీయమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సోమవారం నాగులాపల్లిలో పెతకంశెట్టి 88వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పెతకంశెట్టి విగ్రహానికి నాగజగదీశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెతకంశెట్టి పెందుర్తి సమితి అధ్యక్షుడిగా, శాసనసభ్యునిగా, ఎంపీగా, పార్టీలో సీనియర్ నాయకుడిగా అందించిన సేవలు పార్టీశ్రేణులకు మార్గదర్శకమన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ సొంతనిధులతో ప్రజల అవసరాలు తీర్చిన గొప్ప నాయకుడు పెతకంశెట్టి అని, ఆయన భౌతికంగా మన



పెతకంశెట్టికి నివాళులర్పిస్తున్న పార్టీ ఇన్‌చార్జులు పీలా గోవింద, ప్రగడ నాగేశ్వరరావు

మధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి



పెతకంశెట్టి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, దాడి ముసిలినాయుడు, పి.రాజునాయుడు, భీమిశెట్టి సత్యనారాయణ, పొలమరశెట్టి నాగు, అప్పలనాయుడు, గోసాల గోవింద, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ కార్మికుల సమ్మె

» కనీస వేతనాలివ్వాలి: సీఐటీయూ

అనకాపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రోజువారి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు, యూనియన్ గౌరవాధ్యక్షులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఏఆర్ఎస్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నేటి నుంచి సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఈ సమ్మె చేస్తామని చెప్పారు. బలవంతంగా పోటీ కార్మికులను తీసుకువస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంట్రాక్టర్లు కొంతమంది ఇతర కార్మికులను తీసుకురాగా, కార్మికులు వారిని అడ్డుకున్నారు. లేబర్ కమిషన్ ఆర్డర్ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, రాష్ట్ర కార్మిక శాఖ జారీ చేసిన జాతీయ పండుగ సెలవులు (వేతనంతో కూడిన) కాంట్రాక్టు లేబర్ అందరికీ ఇవ్వాలని కోరారు.కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ.రెండు లక్షలు, ప్రమాదవశాతం మరణిస్తే రూ.ఐదు లక్షలు పరిహారం చెల్లించేందుకు జారీ చేసిన జీవోను కాంట్రాక్టు లేబర్ కూడా వర్తించేలా చేయాలన్నారు.

కార్యక్రమంలో కొణతాల సంతోష్‌కుమార్, ఇసరపు లక్ష్మీ, మళ్ల లక్ష్మి, నక్కా మంగాదేవి, పల్లా రమాదేవి, వెంకటలక్ష్మిపాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

పాయకరావుపేట, ఫిబ్రవరి 19 : మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.06 కోట్లు విడుదలైనట్టు ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పాయకరావుపేట పంచాయతీకి రూ.30,01,542, అరట్లకోటకు రూ.4,07,523, ఈదటంకి రూ.1,52,598, గోపాలపట్నంకి రూ.3,46,427, గుంటపల్లికి రూ.2,94,160, కందిపూడికి రూ.1,06,934 విడుదలయ్యాయన్నారు. మండలంలో కేశవరం పంచాయతీకి రూ.1,23,766, కొత్తూరుకి రూ.1,34,189, కుమారపురానికి రూ.2,92,315, మంగవరానికి రూ.5,48,926, మాసాహెబ్‌పేటకు రూ.2,46,734, నామవరానికి రూ.3,25,255, పీఎల్.పురానికి రూ.4,01,558 విడుదలయ్యాయన్నారు. పాల్మన్‌పేట పంచాయతీకి రూ.4,20,289, పాల్తేరుకు రూ.7,26,040, పెదరాంభద్రపురానికి రూ.3,87,309, పెంటకోటకు రూ.4,61,975, రాజగోపాలపురానికి రూ.1,34,552, రాజవరానికి రూ.2,88,334, ఎస్.నర్సాపురానికి రూ.1,82,178 విడుదయ్యాయన్నారు. సత్యవరం పంచాయతీకి రూ.6,40,293, సీతారాంపురానికి రూ.1,25,217, శ్రీరాంపురానికి రూ.4,43,556, వెంకటనగరం పంచాయతీకి రూ.3,58,075లు విడుదల ఆయ్యాయని తెలిపారు.

అర్జీలపై చర్యలు సంతృప్తికరంగా ఉండాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19: స్పందన వినతులపై అర్జీదారులు తెలిపే సమాధానాలు సంతృప్తి స్థాయిలో ఉండాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితోపాటు జేసీ జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్వరన్‌రాజ్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 299 అర్జీలు అందాయి. వీటిని సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. తిరస్కరణ గురించి వివరంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు, డీఎంహెచ్‌వో హేమంత్, డీపీవో శిరీషారాణి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలి : ఎస్పీ

స్పందన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు గురించి నివేదికను అందించాలని ఆదేశించారు. స్పందన ముగిసేసరికి 41 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు.

రైవాడకు గ్రహణం

... 5వ పేజీ తరువాయి

కాలువల సిమెంట్ లైనింగ్ పనులు ప్రారంభించారు. తొలివిడత చేసిన పనులకు కాంట్రాక్టర్ బిల్లు అప్‌లోడ్ చేసి, మిగిలిన పనులు కొనసాగించారు. రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లు మంజూరు కాకపోవడంతో పనులు ఆపేశారు. అధికారులు భరోసా ఇచ్చినప్పటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు పూర్తిగా ఆపేశారు. అప్పటికి రూ.4.17 కోట్ల విలువైన పనులు (18.5శాతం పనులు) పూర్తిచేశారు. మొత్తం మీద 11 కిలోమీటర్ల మేర సిమెంటు లైనింగ్ పనులు చేశారు. కొద్ది నెలల తరువాత రూ.2.88 కోట్ల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు అందాయి. దీంతో పనులు కొనసాగించాలని అధికారులు కోరారు. మిగిలిన బిల్లు కూడా వస్తేనే పనులు చేస్తానని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. దీంతో అపధికారులు నోటీసులు జారీచేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు నాలుగైదు సార్లు నోటీసులు ఇచ్చిన జలవనరుల శాఖ అధికారులు, తాజాగా నెలన్నర క్రితం మరో నోటీసు జారీచేసి పనులు పూర్తిచేయాలని కోరారు. టెండర్ ఒప్పందం మేరకు గత ఏడాది జూలై నాటికి పనులు పూర్తి చేయాలి. ఒకవేళ పూర్తికాకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించాలి. అయితే బిల్లు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్‌పై చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. అదే విధంగా పనులు సకాలంలో పూర్తిచేయకపోతే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతారు. రైవాడ కాలువల ఆధునికీకరణ పనుల విషయంలో తప్పంతా ప్రభుత్వం వైపున ఉండడంతో ఏం చేయాలన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకవేళ టెండరు రద్దుచేసి కొత్తగా టెండర్లు ఆహ్వానిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వచ్చే పరిస్థితి లేదని అధికారులు గుర్తించారు. వెరసి రైవాడ కాలువల ఆధునికీకరణ పనులకు గ్రహణం పట్టిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు : కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19: విద్యార్థులు, గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీహెచ్‌సీల వైద్యులు, మండల విద్యా శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రక్తహీనత అధికంగా వున్న వారిని గుర్తించి తగిన పౌష్టికాహారం, మందులు వాడేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు, వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు పౌష్టికాహారంపై తగిన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, డీఈవో లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు : జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 19: జిల్లాలో ఈనెల 25వ తేదీన నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎక్కడా చిన్న



పొరపాటుకు కూడా ఆస్కారం ఇవ్వొద్దని స్పష్టం చేశారు. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెంలలో 33 కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,627 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ఏటికొప్పాక రైలు గేటు 3 రోజులు మూసివేత

ఎలమంచిలి, ఫిబ్రవరి 19 : మండలంలో మేజర్ పంచాయతీ ఏటికొప్పాక రైలు గేటు సమీపంలో సోమవారం నుంచి ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో రైలు గేటును 3 రోజులు పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. సోమవారం నుంచి 21 వ తేదీ వరకూ గేటును మూసివేస్తున్నట్టు తెలిపారు. గేటు మూసివేతతో అండర్ బ్రిడ్జి అసౌకర్యంగా ఉన్నా సరే రాకపోకలు సాగించక తప్పడం లేదు. రైలు గేటు 3 రోజులు పాటు మూసివేయడంతో కొంతవరకూ ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

దేవాలయాలు శక్తివంతంగా తయారు కావాలి

రాంబిల్లి, ఫిబ్రవరి 19 : దేవాలయాలు మరింత శక్తివంతంగా తయారు కావాలని సమరసతా సేవా ఫౌండేషన్ ఎలమంచిలి ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. సోమవారం ఆయన పెదకలవలాపల్లిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల్లో భక్తులు వారం, వారం భజనలు చేయాలన్నారు. ప్రతి పౌర్ణమిరోజున సామూహిత హారతి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వై.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 19: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన తోట నానాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదుల గణేష్ రూ. 25 వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని సోమవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో గామ జనసేన నేత శానాపతి బాబూరావు, వంగలపూడి నానాజీ, పేరెడ్డి శ్రీనివాస్, శ్రీవిద్యా శ్రీనివాస్, గుర్రం ధన, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గ విగ్రహ ప్రతిష్ఠ

అచ్యుతాపురం, ఫిబ్రవరి 19: హరిపాలెం హరిగిరిపై సోమవారం విజయదుర్గ విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి వివిధ క్రతువులు, పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి సూర్యనారాయణ, లక్ష్మీకాంతం దంపతులు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యాక్రమాల్లో ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, శరగడం అప్పలనాయుడు, కోన బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో దోమలు స్వైరవిహారం



కొత్తపేటలో చెత్త పేరుకుపోయిన డ్రైనేజీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 19: మునిసిపాలిటీలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల నివారణకు మునిసిపల్ అధికా రులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో అల్లాడుతున్నారు. పగలు, రాత్రి ఇళ్లల్లో ఉండలేని దుస్థితి నెలకొంటుందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు వేలాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు మునిసిపల్ అధికారులు చెబుతున్న మాటలకు.. చేస్తున్న పనులకు పొంతన ఉండడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయింది. పూడిక తీయకపోవడంతో నీరు పారక డ్రైనేజీలు దోమల ఆవాసాలుగా మారాయి. డ్రైనేజీల్లో పిచికారీ చేయాల్సిన దోమల నివారణ మందులు కొన్ని నెలలుగా కొట్టడం లేదని కొత్తపేట కాలనీవాసులు అంటున్నారు. నివారణ చర్యలు తీసుకోకపోవడంతో దోమలు దారుణంగా పెరిగిపోయి ప్రజలపై తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇకనైనా మునిసిపల్ అధికారులు ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా దోమల నివారణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం

పరవాడ, ఫిబ్రవరి 19: విధి నిర్వహణలో ఉత్తమ సేవలను అందించిన వలంటీర్లకు పురస్కారాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సోమవారం ప్రదానం చేశారు. స్థానిక కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్నా, సేవా వజ్రా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బూసా అప్పలరాజు పాల్గొన్నారు.

ఫార్మా జలాల నుంచి మత్స్యసంపదను కాపాడాలి

పరవాడ, ఫిబ్రవరి 19 : ఫార్మాసిటీ వ్యర్థ జలాల నుంచి మత్స్యసంపదను కాపాడాలని ఆంధ్రా మత్స్యకార జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అర్జిల్లి అప్పలరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలు శుద్ధి చేయకుండా పైపులైన్ల ద్వారా నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల మత్స్యసంపద నశించిపోతుందన్నారు. దీని కారణంగా ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం పంచాయతీ పరిధిలో గల సుమారు ఆరువేల మంది మత్స్యకారుల జీవనోపాధి అగమ్యగోచరంగా తయారైందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఫార్మా వ్యర్థ జలాలు నేరుగా సముద్రంలోకి విడిచిపెట్టకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

26న జిల్లా స్థాయి కోలాటం పోటీలు

పరవాడ, ఫిబ్రవరి 19 : మండలంలోని వాడచీపురుపల్లిలో రామచంద్రమ్మ ఉత్సవాలు సందర్భంగా ఈనెల 26న జిల్లాస్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన కోలాటం బృందాలకు రూ. పది వేలు, రూ.ఎనిమిది వేలు, రూ. ఆరువేలు, రూ. నాలుగువేలు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9542113127 సెల్‌నంబరుకు సంప్రదించాలని ఆయన కోరారు.

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం



భావనారుషి కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని సీహెచ్‌ఎల్‌పురంలో సోమవారం భద్రావతి సమేత భావనారుషి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. గ్రామ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి రాజమహేంద్రవరానికి చెందిన ఆమంచి ఆంజనేయులు గురుస్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భావనారుషి గొప్పతనంపై వివరించారు. అనేకమంది దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలి

నక్కపల్లి, ఫిబ్రవరి 19: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో ప్రాథమిక వైద్యసేవలందించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగిన గొడిచెర్ల పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ మెరక గ్రామాల ప్రజలకు రాత్రి వేళల్లో కూడా సిబ్బంది వైద్య సేవలందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గొడిచెర్ల, సీహెచ్ఎల్‌పురం, డొంకాడ సర్పంచులు అల్లు పార్వతి, కర్రి గీతా భవానీ, చందిన కొండలరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కేడర్‌లో జోష్ నింపిన లోకేశ్



డబ్బు వాయిద్యాలతో ఉత్సాహంగా లోకేశ్ సభకు తరలివస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు





టీడీపీలో చేరుతున్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులకు పార్టీ కండువాలు కప్పుతున్న నారా లోకేశ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 19 : మండలంలోని వడ్డాదిలో సోమవారం జరిగిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం సభ విజయవంతమైంది. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు ఉప్పొంగిన ఉత్సాహంతో తరలి వచ్చారు. సభ రాత్రి ప్రారంభమైనప్పటికీ మధ్యాహ్నం నుంచే ప్రాంగణానికి కార్యకర్తల రాక ఆరంభమైంది. సాయంత్రం ఆరు గంటలకు సమయానికి ఎటుచూసినా జనసందోహమే కనిపించింది. సభా ప్రాంగణం చాలకపోవడంతో చాలామంది బీఎన్ రోడ్డుపై నిలిచిపోయారు. 7.30 గంటల సమయంలో లోకేశ్ ప్రసంగం ప్రారంభమైంది.

'దోచుకోవడంలో ఎమెల్యే ధర్మశ్రీ ఘనుడు'

చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దోచుకోవడంలో, దాచుకోవడంలో ఘనుడని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిలు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు ధ్వజమెత్తారు. వడ్డాదిలో సోమవారం జరిగిన లోకేశ్ శంఖారావం సభలో వారు మాట్లాడారు. 2019 వరకు చోడవరం నియోజకవర్గంలో నీతివంతమైన పాలన జరగగా, ధర్మశ్రీ పాలన అంతా అవినీతి మయంగా మారిందని ఆరోపించారు. అతని అసమర్థత, అవినీతి కారణంగా చోడవరం అన్నింటా వెనుకబడి పోయిందని విమర్శించారు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు శాఖల్లో ఏ పనులు కావాలన్నా మామ్మూళ్లు చెల్లించుకోవలసిందేనన్నారు. కుటుంబ సభ్యులతో భూదందాలు, సెటిల్‌మెంట్‌లకు ధర్మశ్రీ పాల్పడ్డారని ఆరోపించారు. ధర్మశ్రీ అసమర్థత కారణంగానే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ప్రగతి తిరోగమనంలో పయనిస్తుందని దుయ్యపట్టారు. రానున్న ఎన్నికల్లో ధర్మశ్రీని ఓడించడం ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, చోడవరం మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, పంచకర్ల రమేష్, ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి దామచర్ల సత్య, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన శ్రీనివాస్‌యాదవ్

యువజన యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు, మల్లాం మాజీ సర్పంచ్ గొలగాని శ్రీనివాస్ యాదవ్ వడ్డాదిలో జరిగిన శంఖారావం సభలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నారా లోకేశ్ అతనికి కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. శ్రీనివాస్‌తో పాటు ఇద్దరు గ్రామ వాలంటీర్లు, వందలాది మంది అనుచరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

కొంగొత్త ఉత్సాహంతో తరలి వచ్చిన కేడర్

రావికమతం : లోకేశ్ శంఖారావం సభకు జనం భారీగా తరలి వచ్చారు. దివ్యాంగులు సైతం జైచంద్రబాబు.. జైలోకేశ్ అంటూ.. నినాదాలు చేసుకుంటూ హాజరయ్యారు. కొంత మంది భిమానులు లోకేశ్ ప్రసంగిస్తున్న సమయంలో జై లోకేశ్ అన్నా... అంటూ విజయ సంకేతాలు చూపుతూ పార్టీ జెండాలను ఊపారు. ఓ కార్యకర్త నాగలితో సభా ప్రాంగణంలోకి అభిమానులతో కలిసి ఊరేగింపుగా వచ్చారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గొలుగొండ, ఫిబ్రవరి 19 : మండలంలోని జోగంపేట, గుండుపాల గ్రామల్లో గౌరీపరమేశ్వరుల ఉత్సవం సోమవారం ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు వివిధ గ్రామాల ప్రజలు ఆదిదంపతులకు పూజలు నిర్వహించారు.

ఆంజనేయ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

దేవరాపల్లి, ఫిబ్రవరి 19 : మండల కేంద్రం దేవరాపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో 36 అడుగుల అభయాంజనేయ విగ్రహాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు దంపతులు సోమవారం శంకుస్థాపన జరిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు భార్య రమణమ్మ, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ పెంటమ్మ పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

రోలుగుంట, ఫిబ్రవరి 19 : బుచ్చెంపేటలో రామాలయం నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఉలబాల చంద్ర పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించండి

నాతవరం, ఫిబ్రవరి 19 : గునుపూడి పీహెచ్‌సీలో మరిన్ని మెరుగైన సేవలు అందించి వైద్యులు, సిబ్బంది రోగుల మన్ననలు పొందాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. సోమవారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ అనూషా, ఎంపీడీవో జె.రాంబాబు, సర్పంచ్ వేముల సూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వి.సూరిబాబు పాల్గొన్నారు.

సమస్యలపై దివ్యాంగులు ఆందోళన

రావికమతం, ఫిబ్రవరి 19 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల దివ్యాంగులు సోమవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నెలకు రూ.ఆరు వేలు పెన్షన్, అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇనాం భూములకు పట్టాలు కోరుతూ నిరసన

కె.కోటపాడు, ఫిబ్రవరి 19 : ఇనాం భూములకు సర్వే జరిపి, పట్టాలు ఇప్పించాలని కోరుతూ మండలంలోని గొండుపాలెం గ్రామానికి చెందిన పలువురు కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సర్వే డీటీకి వినతిని అందజేశారు.

శిలాఫలకాల ధ్వంసంపై టీడీపీ ఫిర్యాదు

చీడికాడ, ఫిబ్రవరి 19 : ఖండివరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఇటీవల కొంతమంది దుండగులు ధ్వంసం చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు దయాకర్, దోకల అప్పలనాయుడు తదితరులు సోమవారం ఫిర్యాదు చేశారు.

ఓటర్ల జాబితాలో తప్పులపై గ్రామ సభ

మాకవరపాలెం, ఫిబ్రవరి 19 : శెట్టిపాలెంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఓటర్ల జాబితాలు సక్రమంగా లేవని శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు చేసిన ఫిర్యాదు మేరకు ఇక్కడకు విచ్చేశారు. 242 పోలింగ్ బూత్‌లో కొన్నిఓట్లు తప్పులుగా ఉండడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందించనున్నారు. డీటీ శంకరరావు, సర్వే డీటీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు మాడుగుల, నర్సీపట్నంలో
లోకేశ్ శంఖారావం సభలు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 19 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం బహిరంగ సభ మాడుగుల మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్- డి.సురవరం గ్రామాల మధ్య మంగళవారం జరగనుంది. ఉదయం పది గంటలకు పారంభం కానున్న ఈ సభకు సంబంధించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీకుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు తదితరులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సభా ప్రాంగణంతో పాటు రోడ్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సం ఘాల సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాల్సిందిగా వారు పిలుపునిచ్చారు.

నర్సీపట్నం : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం బహిరంగ సభకు నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు బలిఘట్టంలోని తలుపులమ్మతల్లి గుడి సమీపంలో గల విశాలమైన స్థలంలో సభ జరగనుంది. ఈ కార్యక్రమానికి పదివేల మంది నాయకులు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలు, స్థానికులు హాజరవుతారని అంచనా వేసి కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులపై గ్రామ సభ

మాకవరపాలెం, ఫిబ్రవరి 19 : శెట్టిపాలెంలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఓటర్ల జాబితాలు సక్రమంగా లేవని శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు చేసిన ఫిర్యాదు మేరకు ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 242 పోలింగ్ బూత్‌లో కొన్ని ఓట్లు తప్పులుగా ఉండడంతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందించనున్నారు. డీటీ శంకర రావు, సర్వే డీటీ కృష్ణమూర్తి, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి దారుణం

▸▸ జర్నలిస్టు సంఘాలు ఖండన ▸▸ రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్ 'సిద్ధం' బహిరంగ సభ సందర్భంగా తన విధి నిర్వహణలో ఉన్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడిచేయడం అమానుషమని పలువురు జర్నలిస్టులు ఖండించారు. ఇందుకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లంక రామచంద్రరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి చినబాబు, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, జిల్లాకార్యవర్గ సభ్యుడు ఎదురువాడ రామగణేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు నీలాద్రి విజయ్, పసుపులేటి ప్రభాకర్, ముమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జనపాల శ్రీనివాసరావు, వరాహాలు, ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా సోమవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఏపీడబ్ల్యూజే చోడవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు విలేకరులు వైసీపీ మూకల దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో జర్నలిస్టులకు భద్రత కరువైందని ఆరోపించారు. పత్రికా ప్రతినిధులకే రక్షణ కరువైతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ఏపీడబ్ల్యూజే జిల్లా సంయుక్త కార్యదర్శి కోవెల శ్రీనివాసరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు ప్రశ్నించారు. స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడికి దిగిన వారిని వెంటనే అరెస్టు చేయడంతో పాటు, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజే ప్రతినిధులు కోవెల శ్రీనివాసరావు, డీవీఎం నాయుడు, రామకోటి, వి.జోజి, సానబోయిన గోవింద్, ఈశ్వర్, కళ్యాణ్, పందిరి చిన్న, ఎస్.రాజగోపాల్, సానా సతీష్, సత్యనారాయణ, సిరిగిరిశెట్టి రాము, వేణు, పోలిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైవాడకు గ్రహణం

... 5వ పేజీ తరువాయి

కాలువల సిమెంట్ లైనింగ్ పనులు ప్రారంభించారు. తొలి విడత చేసిన పనులకు కాంట్రాక్టర్ బిల్లు అప్‌లోడ్ చేసి, మిగిలిన పనులు కొనసాగించారు. రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లు మంజూరు కాకపోవడంతో పనులు ఆపేశారు. అధికారులు భరోసా ఇచ్చినప్పటికీ నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు పూర్తిగా ఆపేశారు. అప్పటికి రూ.4.17 కోట్ల విలువైన పనులు (18.5శాతం పనులు) పూర్తిచేశారు. మొత్తం మీద 11 కిలోమీటర్ల మేర సిమెంటు లైనింగ్ పనులు చేశారు. కొద్ది నెలల తరువాత రూ.2.88 కోట్ల మేర కాంట్రాక్టర్‌కు బిల్లులు అందాయి. దీంతో పనులు కొనసాగించాలని అధికారులు కోరారు. మిగిలిన బిల్లు కూడా వస్తేనే పనులు చేస్తానని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. దీంతో అపధికారులు నోటీసులు జారీచేయడం ప్రారంభించారు. ఇప్పటి వరకు నాలుగైదు సార్లు నోటీసులు ఇచ్చిన జలవనరుల శాఖ అధికారులు, తాజాగా నెలన్నర క్రితం మరో నోటీసు జారీ చేసి పనులు పూర్తిచేయాలని కోరారు. టెండర్ ఒప్పందం మేరకు గత ఏడాది జూలై నాటికి పనులు పూర్తి చేయాలి. ఒకవేళ పూర్తి కాకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించాలి. అయితే బిల్లు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్‌పై చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. అదే విధంగా పనులు సకాలంలో పూర్తిచేయకపోతే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెడతారు. రైవాడ కాలువల ఆధునికీకరణ పనుల విషయంలో తప్పంతా ప్రభుత్వం వైపున ఉండడంతో ఏం చేయాలన్నదానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకవేళ టెండరు రద్దుచేసి కొత్తగా టెండర్లు ఆహ్వానిస్తే పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు వచ్చే పరిస్థితి లేదని అధికారులు గుర్తించారు. వెరసి రైవాడ కాలువల ఆధునికీకరణ పనులకు గ్రహణం పట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడవికి వెళ్లేందుకు దారి కల్పించాలని ధర్నా

చీడికాడ, ఫిబ్రవరి 19 : మండల కేంద్రం చీడికాడ శివారు కొండవీధి గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని కోరుతూ పలువురు గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కొండవీధి ఆదివాసీలతో పాటు వన సంరక్షణ సమితి సభ్యులు, అటవీ సిబ్బంది దశాబ్దాల నుంచి ఉపయోగిస్తున్న కాలిబాటను కొంతమంది అడ్డగిస్తున్నారన్నారు. అనంతరం డీటీ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.గణేశ్, కోట కొండలరావు, జన్ని లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.